సాక్షి కామారెడ్డి

శనివారం । 12 । ఆగస్టు । 2023



సేంద్రియ సాగుతో లాభాలు

సేంద్రియ వ్యవసాయంతో రైతులు మంచి లాభాలు గడించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నవీన్‌కుమార్ సూచించారు.

- IIలో ▸



పరీక్ష రద్దు చేయాలి

ఏఎన్ఎం పరీక్షను రద్దు చేసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
36.6 /22.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

బస్సు భారం.. రైలే నయం

ఆర్టీసీ సంస్థ ఎడాపెడా చార్జీలను పెంచడంతో ప్రయాణికులు బస్సెక్కాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్, నిజామాబాద్ రూట్లలో ప్రయాణించేవారిలో చాలా మంది చార్జీల భారాన్ని తగ్గించుకోవడానికి రైళ్లను ఆశ్రయిస్తున్నారు. సీట్లు లేకపోతే నిల్చొని ప్రయాణిస్తున్నారు. దీంతో ఇటీవలి కాలంలో రైళ్లలో రద్దీ పెరిగింది.

- ఆర్టీసీ చార్జీల మోతతో ఇబ్బందిపడుతున్న సామాన్యులు
- ప్రత్యామ్నాయంగా రైళ్లలో ప్రయాణానికి మొగ్గు
- హైదరాబాద్, నిజామాబాద్ రూట్లలో పెరిగిన రద్దీ
- జనరల్ బోగీలు పెంచాలని కోరుతున్న ప్రయాణికులు



స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

సాక్షి, కామారెడ్డి : రాష్ట్రంలో రెండేళ్లలో ఆర్టీసీ బస్సు చార్జీలు భారీగా పెరిగాయి. దీంతో బస్సు ప్రయాణం ప్రజలకు భారంగా మారింది. కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులో వెళ్లాలంటే చార్జీ రూ. 110 వసూలు చేస్తున్నారు. అదే రైలులో అయితే రూ. 35 చెల్లిస్తే సరిపోతుంది. అలాగే కామారెడ్డి నుంచి సికింద్రాబాద్, కాచిగూడలకు వెళ్లాలంటే రైలు చార్జీ రూ. 55 ఉంది. ఎక్స్‌ప్రెస్ బస్సులో వెళ్లాలంటే రూ. 180, డీలక్స్‌లో అయితే 220 చెల్లించాల్సిందే. కాగా కరోనా తర్వాత ప్యాసింజర్ రైలు చార్జీలు, ఎక్స్‌ప్రెస్ రైలు చార్జీలు ఒకేవిధంగా వసూలు చేస్తున్నారు. కరోనాకు ముందు ప్యాసింజర్ రైలు చార్జీలు మరీ చవకగా ఉండేవి. బస్సులలోచార్జీలు భారీగా ఉండడంతో సామాన్యులు ఇబ్బందిపడుతున్నారు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే చాలామంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రత్యామ్నాయం ఉన్నవారు మాత్రం బస్సు ప్రయాణాన్ని ఇష్టపడడం లేదు. ప్రధానంగా హైదరాబాద్, నిజామాబాద్ రూట్లలో రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన తాకిడి.. స్టేషన్‌లో సందడి

కామారెడ్డి స్టేషన్ మీదుగా ఇటు ఉత్తర భారతం, అటు దక్షిణ భారతంలోని వివిధ రాష్ట్రాలకు రైలు సౌకర్యం ఉంది. రోజూ 55 నుంచి 60 రైళ్లు తిరుగుతున్నాయి. కొన్ని రైళ్లు సూపర్‌ఫాస్ట్‌వి ఉన్నాయి. రైల్వే లైన్ విద్యుదీకరణతో రైళ్ల వేగం కూడా పెరిగింది. డబ్లింగ్ చేస్తే రైళ్ల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నిజామాబాద్, బాసర, నాందేడ్ ప్రాంతాలకూ ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటారు. ఇక్కడ రోజూ తక్కువలో తక్కువ 1,500 టికెట్లు అమ్ముడుపోతున్నాయి. ఇవే కాకుండా చాలామంది ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. వారి సంఖ్య కూడా ఎక్కువే.. ప్రయాణికుల తాకిడి పెరిగిపోవడంతో రైల్వే స్టేషన్ ఆవరణలో సందడి కనిపిస్తోంది. కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో రైలు వచ్చినపుడు స్టేషన్ అంతా రద్దీగా మారిపోతోంది. రైలు ఎక్కడానికి వచ్చిన వారు, రైలు దిగినవారితో హడావిడి ఉంటోంది.

తిరుపతి, షిరిడీ రూట్లలో...

కామారెడ్డి స్టేషన్ మీదుగా అటు తిరుపతికి, ఇటు షిరిడీకి రైళ్లు నడుస్తున్నాయి. రోజూ ఆయా ప్రాంతాలకు రైళ్లు వెళుతున్నాయి. దీంతో చాలామంది ఆన్‌లైన్‌లో రైలు టికెట్లు బుక్ చేసుకుని తీర్థయాత్రలు చేస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రముఖ ఆలయాల దర్శనాలకు వెళుతున్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లు రోజూ తిరుపతికి వెళతాయి. అలాగే షిరిడీకి కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి. ఇదే రూట్‌లో బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో వెళుతున్నారు.

ముంబయికి వెళ్లేవారూ ఎక్కువే...

దేశ వాణిజ్య రాజధాని ముంబయికి నిత్యం వెళ్లేవారి సంఖ్య వందల్లో ఉంటోంది. కామారెడ్డి స్టేషన్ నుంచి కామారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, మెదక్ జిల్లాలకు చెందిన వారు ఎంతో మంది ముంబయికి వెళ్లడానికి కామారెడ్డి స్టేషన్‌కు వస్తుంటారు. రోజూ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ముంబయికి దేవగిరి ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. దీంట్లో ముందుగా రిజర్వు చేసుకుని వెళుతుంటారు. జనరల్ బోగీలు రెండే రెండు ఉన్నాయి. వాటిలో ప్రయాణం ఇబ్బంది అయినా, తప్పనిసరి పరిస్థితుల్లో వాటిలోనూ ప్రయాణం చేస్తున్నారు.

బోగీలు సరిపోక ఇబ్బందులు..

రైళ్లలో జనరల్ బోగీలు సరిపోవడం లేదు. ప్రతి రైలులో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ప్యాసింజర్ రైళ్లలో మాత్రమే జనరల్ బోగీలు ఎక్కువున్నాయి. అయితే రైలు అటు సికింద్రాబాద్/కాచిగూడ నుంచి ఇటు నిజామాబాద్, నాందేడ్ ప్రాంతాల నుంచి వస్తున్నపుడు జనరల్ బోగీలు కూడా నిండిపోయి ఉంటున్నాయి. దీంతో కామారెడ్డి స్టేషన్‌లో రైలు ఎక్కిన ప్రయాణికులు.. చాలా సందర్భాలలో గమ్యస్థానం చేరేంతవరకు నిలబడాల్సిన పరిస్థితి ఉంటోంది. అయినా సరే ప్రయాణికులు రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. బస్సులతో పోల్చితే చార్జీలు గణనీయంగా తక్కువగా ఉండడమే ఇందుకు కారణం.

తక్కువ చార్జీ ఉంటుందని..



తెరుపతికి వెళ్తున్నాం. బస్సులో అయితే వేలల్లో చార్జీ అవుతుంది. అందుకే రైలులో వెళ్తున్నాం. రైలు ప్రయాణం సౌకర్యంగా కూడా ఉంటుంది. గతంలోనూ రైలులోనే వెళ్లాం.

–వడ్ల శ్రీనివాస్, బస్వాపూర్

సౌకర్యంగా ఉంటుంది



రైలు ప్రయాణం బాగుంటుంది. బస్సుతో పోల్చితే రైలు చార్జీలు కూడా బాగా తక్కువ. అందుకే దూర ప్రయాణాలు చేయాలనుకుంటే రైలులోనే వెళ్తాం.

–భార్గవి, అడ్లూర్ ఎల్లారెడ్డి

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



రాజశ్రీతో జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ఢిల్లీ ప్రతినిధి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ఖజానాను ఖాళీచేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికలలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, నాయకులు దత్తేశ్వరి, సుమ, ఫరీద, సంధ్య, నాగరాణి, సుస్రత్, శిరీష, భార్గవి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేస్తే కఠిన చర్యలు

- అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి హెచ్చరిక
- ఎక్కపల్లి ఘటనలో పదిమంది రిమాండ్




మాట్లాడుతున్న ఏఎస్పీ నర్సింహారెడ్డి

లింగంపేట: పోలీసులపై తిరగబడితే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన లింగంపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎక్కపల్లి గ్రామానికి చెందిన పలువురు అటవీ భూములను కబ్జా చేయడానికి చెట్లను, పొదలను నరికివేస్తున్నారని ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓంకార్ ఫిర్యాదు ఇచ్చారన్నారు. దీంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో చర్చించడానికి ముఖ్యమైన వ్యక్తులు రావాలని పిలిచినా ఎవరూ స్పందించలేదన్నారు. దీంతో పోలీసులు కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పోలీసు జీప్‌పై దాడి చేశారని, ఈ ఘటనలో నాగిరెడ్డిపేట ఏఎస్సై ఉమేష్, కానిస్టేబుల్ చంద్రయ్యలకు స్వల్ప గాయాలయ్యాయని, జీవు ధ్వంసమైందని ఏఎస్పీ తెలిపారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ల్యాగల గోపాల్, పాపమోల్ల శ్రీకాంత్, దుర్గయ్య, ల్యాగల రాజు, బాగయ్య, శ్రీను, పాపమోల్ల పరంధాములు, గంగమోళ్ల గంగయ్య, తొర్రి రవి, మాదాసు బాలాగౌడ్లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరికొంత మందిని అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. సమావేశంలో కామారెడ్డి ఎఫ్‌డీవో గోపాల్‌రావు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బలగాల మోహరింపు

ఎక్కపల్లికి చెందిన పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించే అవకాశం ఉందన్న సమాచారంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. సదాశివనగర్, ఎల్లారెడ్డి, గాంధారి, తాడ్వాయి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన పోలీసులు, ప్రత్యేక బలగాలను రప్పించి లింగంపేట పోలీస్ స్టేషన్ వద్ద మోహరించారు.



జప్తిజాన్కంపల్లి శివారులో కనువిందు చేస్తున్న వరిపంటలు

భూమికి పచ్చాని రంగేసినట్టు..

జప్తిజాన్కంపల్లి శివారులో ఊరచెరువు కింద సాగు చేసిన భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. కనుచూపు మేర మొత్తం భూమికి పచ్చని రంగేసినట్లుగా వరిపంట ఉంది. ఊరచెరువు కట్టపై నుంచి వెళ్లేవారికి పచ్చనిపంటలు కనువిందు చేస్తున్నాయి. – నాగిరెడ్డిపేట

న్యూస్‌రీల్

'ప్రజలకు సేవలందించాలి'



కామారెడ్డి టౌన్: శిక్షణ అనంతరం ప్రజలకు మంచి సేవలందించి గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఇటీవల ప్రకటించిన ఎస్సై ఫలితాల్లో ఎంపికైన జిల్లాకు చెందిన ఎనిమిది మంది శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. వారిని ఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సైలుగా ఎంపికైన ప్రసాదరావు, అరవింద్ కుమార్, నరేష్, సుచిత, శిరీష, కీర్తిరాజ్, హరీశ్‌రెడ్డి, సృజన పాల్గొన్నారు.

'ప్రజల ఆరోగ్య సంరక్షణ వైద్య సిబ్బంది బాధ్యత'



భిక్కనూరు: ప్రజల ఆరోగ్య సంరక్షణను వైద్య సిబ్బంది తమ బాధ్యతగా భావించాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ సూచించారు. శుక్రవారం బస్వాపూర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి వారం గ్రామాల్లోని నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఆరోగ్య ఉపకేంద్రాలను ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తప్పనిసరిగా తెరిచి ఉంచాలని వైద్య శాఖ మంత్రి ఆదేశించారని, ఆ ఆదేశాల అమలు తీరు తెలుసుకునేందుకు సబ్ సెంటర్‌లను తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. బీపీ, మధుమేహం బాధితులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యుడు ఆదర్శ్, ఏఎన్ఎం రేణుక ఉన్నారు.

'పకడ్బందీగా పారిశుధ్య పనులు నిర్వహించాలి'



నాగిరెడ్డిపేట: గ్రామంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాసరావు సూచించారు. నాగిరెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో అనాథ పిల్లల గుర్తింపు సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం'



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు రాములు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి పాఠశాలలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ కలీముద్దీన్, ప్రతినిధులు నటరాజ్, కిషోర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

సాక్షి, కామారెడ్డి: మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువగా వస్తున్నాయి. శుక్రవారం ఒక్కరోజే 181 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా శుక్రవారం సాయంత్రం వరకు 352 దరఖాస్తులు వచ్చాయన్నారు. కామారెడ్డి సర్కిల్ పరిధిలో 137, దోమకొండ సర్కిల్‌లో 87, ఎల్లారెడ్డి సర్కిల్‌లో 21, బాన్సువాడ సర్కిల్‌లో 65, బిచ్కుంద సర్కిల్ పరిధిలో 42 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కామారెడ్డి సర్కిల్‌లో రెండు దుఖానాలకు ఇంకా బోణీ కాలేదన్నారు. ఇంకా వారం గడువు ఉండడంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

'పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యత'



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. శుక్రవారం మాగిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు సొంతభవనాల నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కమ్మరికత్త అంజయ్య, ఎంపీటీసీ బాలమణి, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, విఠల్, మనోహర్, రమేశ్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'టార్గెట్ చేరుకోకపోతే చర్యలు తప్పవు'



మాట్లాడుతున్న డీఆర్డీవో సాయన్న

కామారెడ్డి రూరల్: బ్యాంక్ లింకేజీ రుణాల టార్గెట్‌లో ఈ ఏడాదిలో 25 శాతంకన్నా తక్కువ ప్రగతి సాధించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో సాయన్న హెచ్చరించారు. శుక్రవారం కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో 22 మండలాల సీసీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీలో ఈ సంవత్సరం 11,787 సంఘాలకు రూ. 665 కోట్ల రుణాలివ్వాలన్నది లక్ష్యమన్నారు. ఇప్పటివరకు 2,583 సంఘాలకు రూ. 158 కోట్ల రుణాలిచ్చామన్నారు. టార్గెట్‌లో 25 శాతంకన్నా తక్కువ ప్రగతిని సాధించిన 79 మంది సీసీలు వారి పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. స్త్రీనిధి ఎన్‌పీఏ ఎక్కువగా ఉన్నవారు ఆ శాతాన్ని తగ్గించాలని స్త్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్ ఆదేశించారు. ఎంటర్‌ప్రైజెస్ కింద సభ్యులను వందశాతం గుర్తించాలని, వారికి బీఎల్, ఎస్ఎన్, వీవో ద్వారా రుణాలు ఇప్పించి ఎంటర్‌ప్రైజెస్ గ్రౌండింగ్ చేయాలని డీపీఎం రమేష్‌బాబు సూచించారు. డీపీఎంలు వకుల, సురేష్‌కుమార్, అడిషనల్ డీఆర్డీవో మురళీకృష్ణ, బీఎల్ డీపీఎం రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం'



సుభాష్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థుల ప్రదర్శన

బీబీపేట: జీవితాంతం ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జన్మదినాన్ని జరుపుకోవడానికి హైదరాబాద్‌నుంచి సొంతూరు మల్కాపూర్‌కు వచ్చారు. ఆయనకు బీబీఎస్ బైపాస్ చౌరస్తా అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి సుమారు రెండు వందల కార్లతో ర్యాలీగా మల్కాపూర్ వచ్చారు. గ్రామంలో సొంత నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని బాలాంజనేయ స్వామి ఆలయం వద్ద భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. దోమకొండ మండలం అంచనూరులో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బీబీపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమాలలో సుభాష్‌రెడ్డి హైదరాబాద్ మిత్రమండలి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, లోకేశ్ గుప్తా, అధికారులు, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుభాష్‌రెడ్డి దంపతులు

క్లుప్తంగా

పీజీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 14 నుంచి ప్రారంభం కావాల్సిన పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా పీజీ పరీక్షలను విద్యార్థుల వినతి మేరకు ఈ నెల 16 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పీజీ 2వ, 4వ సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్, బీఎల్ఐఎస్సీ 2వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

సయ్యదా అమెనా మక్బూల్‌కు డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థిని సయ్యదా అమెనా మక్బూల్ డాక్టరేట్ సాధించారు. తెయూ ఉర్దూ విభాగం మాజీ ప్రొఫెసర్ అత్తర్ సుల్తానా పర్యవేక్షణలో 'సయ్యద్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్‌కి సహఫాతి ఖిద్మత్' అనే అంశంపై అమెనా పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ ప్రొఫెసర్ ఎస్ ఏషకూర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. డాక్టరేట్ సాధించిన మక్బూల్‌ను శాలువాతో సత్కరించారు.

చంద్రయాన్- 3 వీక్షణకు ఎంపిక


కె వెంగనవాసు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వెంగనవాసు చంద్రుడిపై చంద్రయాన్- 3 అడుగుపెట్టే విధానం చూడటానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు బెంగళూరు ఇస్రో కంట్రోల్ సెంటర్ నుంచి విద్యార్థికి ఆహ్వానం వచ్చింది. తెలంగాణ నుంచి వెంగనవాసు ఒక్కడే ఎంపికయ్యాడు.

కేజీబీవీ అర్హత పరీక్ష ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: కేజీబీవీలో ఖాళీల భర్తీకి ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జిల్లాకు సంబంధించిన అర్హుల జాబితాను schooledu. telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. మెరిట్ లిస్టును కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో పొందుపరిచినట్లు తెలిపారు.

కేటీఆర్ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి: ఎల్లారెడ్డి, తాడ్వాయి మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ సభ వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 14న ఎల్లారెడ్డి పట్టణంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ విచ్చేస్తున్నారని అన్నారు. కేటీఆర్ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావు, బీఆర్ఎస్ తాడ్వాయి అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి , ఎంపీపీ రవి, వైస్ ఎంపీపీ నర్సింలు, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలున్నారు.

నత్తనడకన 'లక్ష్మి' ఆధునికీకరణ

- ఐదేళ్ల క్రితం నిధుల విడుదల
- ఎట్టకేలకు పునఃప్రారంభమైన కాలువ మరమ్మతు పనులు
- ఎల్–4 కాలువలో పూడిక తొలగిస్తున్న అధికారులు


రెంజర్ల వద్ద లక్ష్మి మైనర్ కాలువలో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులు పునఃప్రారంభమయ్యాయి. లక్ష్మి కాలువ మైనర్ కాలువ ఎల్–4కు ప్రస్తుతం నీరు సరఫరా కావడం లేదు. దీంతో పూడికతీత పనులు ప్రారంభించారు. కాలువ ఆధునికీకరణ కోసం ప్రభుత్వం 2017లో భారీగా నిధులను మంజూరు చేసింది. 2018లో పనులను ప్రాంభించారు. అప్పటి నుంచి పనులు సాగుతునే ఉన్నాయి. ఇప్పటికీ పూర్తి కాలేదు. ముందుగా చేపట్టిన పనులు మళ్లీ మరమ్మతులకు వస్తున్నాయి. కానీ చివరి వరకు పనులు చేపట్టడంలేదు. సకాలంలో బిల్లులు రాకపోవడం ఓ కారణమైతే... కాంట్రాక్టర్ కూడా పనులు సకాలంలో చేపట్టకపోవడం మరోకారణం. కాలువల ద్వారా నీటి విడుదల జరుగుతుండటంతో అన్ సీజన్‌లో పనులు చేపట్టాల్సి వేగవంతంగా పూర్తి చేయాలి. కానీ నీటి విడుదల ప్రారంభించే పది రోజుల ముందు పనులు ప్రారంభించి, నీటి విడుదల మొదలు కాగానే నిలిపివేస్తున్నారు. దీంతో పనులు ఒక్క అడుగు ముందుకు, ఆరు అడుగులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. లక్ష్మి డీ–4 కాలువలో ఎల్–4 ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామం పక్క నుంచి వెంచిర్యాల్ వరకు ప్రవహిస్తుంది. గత ఐదారేళ్లుగా ఆ కాలువ ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా కావడం లేదు. అయిన అధికారులు పట్టించుకోలేదు. మరమ్మతులు చేపట్టలేదు. ప్రస్తుతం కాలువలో పూడిక తీసే పనులు చేపడుతున్నారు. ఏటా అదే కాలువలో పేరుకు పోయిన పూడిక తొలిగించడం మళ్లీ చేతులే త్తేయడం ఇదే తంతు జరుగుతుంది. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అన్నదాతల అవస్థలు

బాల్కొండ: లక్ష్మి కాలువ మైనర్ కాలువలు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోవడంతో అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు. కాలువకు అడ్డంగా ముళ్లపొదలు ఉండటంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో రైతులే స్వయంగా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించారు. ప్రతి సంవత్సరం


నీటి విడుదలకు ముందు కాలువలో పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

లక్ష్మికాలువ ఎల్–4 ద్వారా నీరు వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామం పక్క నుంచి కాలువ ఉండటంతో ప్రతి సంవత్సరం చెత్త చెదారంతో కాలువ నిండి పోతుంది. దీంతో ప్రవాహానికి అడ్డుగా మారుతోంది. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఇదివరకే ఆదేశించాం.

– సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

'అన్ని దానాల కంటే రక్తదానం గొప్పది'


సౌత్‌క్యాంపస్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

భిక్కనూరు: అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని దానిని మించినది మరొక్కటి లేదని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్–5, 6 అధికారులు డాక్టర్ అంజయ్య, డాక్టర్ నాగరాజులు అన్నారు. శుక్రవారం సౌత్ క్యాంపస్‌లో యూనిట్ల ఆధ్వర్యంలో నిజామాబాద్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. బ్లడ్ బ్యాంక్ సొసైటీ కార్యదర్శి ఎఆర్‌వో ఖురేషి, టెక్నికల్ సూపర్‌వైజర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి సహకారం


ప్రతినిధులతో వెంకటరమణారెడ్డి

దోమకొండ: కుల సంఘాలు, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం దోమకొండతో పాటు చింతమాన్‌పల్లి, లింగుపల్లి గ్రామాలకు చెందిన వివిధ కులసంఘాల ప్రతినిధులు ఆయనను కలిశారు. తమ సంఘాల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలి


లింగాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ

కామారెడ్డి రూరల్: లింగాపూర్‌లో శుక్రవారం వరి పొలాలను ఏడీఏ అపర్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొలాలలో ఎక్కువగా కాండం తొలిచే పురుగు బాగా ఆశిస్తోందని, ఇది నారుమడి దశలో ఆశిస్తే మొవ్వలు ఎండిపోయి చనిపోతాయన్నారు. అంకురం నుంచి చిరు పొట్ట దశలో ఆశిస్తే ఈ నెల తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయన్నారు. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా క్లోరిన్‌ట్రనిప్రోల్ 0.4ఏ గుళికలు నాలుగు కేజీలు ఎకరానికి వెదజల్లాలన్నారు. రైతులు గనక ఈ జాగ్రత్తలు తీసుకుంటే మువ్వ పురుగు నుంచి పంటను కాపాడొచ్చని పేర్కొన్నారు. సకాలంలో కలుపు తీసి ఎకరానికి 20 కేజీల యూరియా మాత్రమే వెదజల్లుకోవాలన్నారు. ఆమె వెంట ఏవో శ్రీనివస్‌రావు, ఏఈవో తేజశ్విని, తదితరులున్నారు.

ఏఎన్ఎంల పరీక్షను రద్దు చేయాలి


కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

- కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్

కామారెడ్డి టౌన్: పరీక్షలను రద్దు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, కాంట్రాక్ట్ ఏఎన్ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మానవ హారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారం రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేశాకనే పరీక్ష జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించాలని లేని పక్షంలో ఆగస్టు 16 నుంచి రిలే దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏఎన్ఎం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజుల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజ్, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో శుక్రవారం ఆరోగ్య కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదని వారన్నారు. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, సునీత, సవిత, సుజాత, సులోచన, సుజాత, సత్యమ్మ తదితరులున్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీహెచ్ఏ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు బిచ్కుందలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ ఆర్‌వోఆర్ అనుసరించి డీఎస్సీ కమిటీ ద్వారా నియమితులయ్యామని, నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం మాకు ఉద్యోగులుగా గుర్తించడం లేదని వాపోయారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించినా చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సేంద్రియ సాగుతో లాభాలు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్, హాసాకొత్తూర్‌లో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మాచారెడ్డి: సేంద్రియ వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నవీన్‌కుమార్ సూచించారు. మండలంలోని కొత్తపల్లిలో మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సేంద్రియ సాగుపై జిల్లాలోని పలు గ్రామాల రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ మాట్లాడుతూ జీవన ఎరువులు, డీఏపీ దుక్కిలో వేసుకోవాలని సూచించారు. ఆర్ఎఫ్ డీపీఎం రాజు, రంజిత్, శ్వేత, వీరేశం, సర్పంచ్ లక్ష్మణ్, రైతులు మల్లారెడ్డి, శ్రీకాంత్, చంద్రయ్య, యూసుఫ్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వినాయక్, ప్రసాద్, సతీష్, నాగేందర్, నర్సింలు పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో సాగవుతున్న సోయాబీన్ పంటలను రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. శాస్త్రవేత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ అధిక వర్షాల తర్వాత పొడి వాతావణంతో సోయా చిక్కుడు పంటలో ప్రస్తుతం కాండం కుళ్లు, పల్లాకు తెగుళ్ల ఆశించినట్లు తెలిపారు. దీంతో పాటు కాండం ఈగ, పెంకు పురుగు కూడా మోస్తరు వరకు ఆశించిందని చెప్పారు. కాండం కుళ్లు ఆశించడంతో మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయని తెలిపారు. దీని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి చొప్పున లేదా ఉధృతి ఎక్కువగా ఉంటే ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్, టేబ్యుకొనజోల్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల తడిచేల పిచికారి చేసుకోవాలన్నారు. పల్లాకు తెగులు నివారణకు అసిటమెప్రిడ్ 0.2 గ్రాములు లేదా డైఫెన్థ్యురాన్ 1.25 గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చని తెలియజేశారు. సేద్య విభాగం శాస్త్రవేత్త ఎం సురేష్ మాట్లాడుతూ సోయాలో వివిధ పోషక లోపాలు, వాటి నివారణ గురించి వివరించారు. ఏవో లావణ్య, ఏఈవో సాయిరాం, సర్పంచ్ ఏనుగు పద్మ, ఉప సర్పంచ్ రాజేశ్వర్, రైతుబంధు సమన్వయ కర్త నోముల నరేందర్, సొసైటీ వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్ పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్



డిచ్‌పల్లి: గల్ఫ్ దేశాలకు పంపిస్తామని డబ్బులు తీసుకొని ఉడాయించిన ఎడపల్లి మండలం ఎంఎస్ ఫారంనకు చెందిన బషీర్ అబ్దుల్ కుర్షిన్ (31)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు.. బషీర్ డిచ్‌పల్లిలో ట్రావెల్స్‌ను ఏర్పాటు చేసి, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు గల్ఫ్ దేశంలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేశాడు. నడిపల్లి గ్రామానికి చెందిన రంజిత్ దగ్గర డబ్బులు తీసుకొని గల్ఫ్ పంపకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి నుంచి కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న డిగ్రీ, పీజీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాజేశ్వర్ మాట్లాడుతూ గతంలో పని చేసిన రిజిస్ట్రార్లు పలు డిగ్రీ, పీజీ కళాశాలలకు వసతులు లేకుండానే అనుమతులు ఇచ్చారన్నారు. కామన్ సర్వీస్, అఫిలియేషన్ ఫీజు చెల్లించని కళాశాలలకు పర్మిషన్ రెన్యూవల్ చేస్తున్నారని విమర్శించారు. కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతూ, అఫిలియేషన్ ఫీజు చెల్లించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 14 నుంచి జరిగే సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. నాయకులు దేవిక, రవీందర్, అక్షయ్, శివసాయి, అశ్విత్ పాల్గొన్నారు.

కుంటలో పడి యువకుడి మృతి

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల పరిధిలోని తొండాకూర్ శివారు వద్ద నీటి కుంటలో పడి నందిపేట్‌కు చెందిన ఆదిముల్ల సాయికిరణ్ (21) మృతి చెందాడు. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాలు.. సాయికిరణ్ ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ద్విచక్ర వాహనంపై కుద్వాన్‌పూర్ నుంచి తొండాకూర్ వైపు వస్తుండగా ఇటీవల వర్షాలకు రోడ్డు తెగిన నీటి కుంటలో పడి మరణించినట్లుగా భావిస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

మస్కట్‌లో పోచంపాడ్‌వాసి మృతి


రాజేందర్ (ఫైల్)

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన మైలారం రాజేందర్(45) మస్కట్‌లో గుండెపోటుతో నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రాజేందర్ కొన్నేళ్లుగా బతుకు దెరువు కోసం మస్కట్‌లో ఉంటున్నాడు. మంగళవారం ఆయన గదిలో గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం గ్రామానికి మృతదేహం రావడంతో అంత్యక్రియలను నిర్వహించారు.

కరెంట్ షాక్‌తో రైతు..


సీతారామ్(ఫైల్)

మాచారెడ్డి: కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తడ్కపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అజ్మీరా సీతారామ్(47) గ్రామ శివారులోని పొలం వద్ద వరి నాటు వేస్తున్నారు. బోరు మోటారు నుంచి నీళ్లు రాకపోయేసరికి స్టార్టర్ సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అది గమనించిన సీతారాం ఇద్దరు భార్యలు స్థానికులకు సమాచారమందించారు. స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

పెద్దకొడప్‌గల్: బైక్ అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య(48) తన కూతురిని చూడటానికి కాటెపల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా పెద్దకొడప్‌గల్ సమీపంలో బ్రిడ్జి పక్కన సర్వీస్ రోడ్డుపై బైక్ అదుపు తప్పి కిష్టయ్య కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూతురు మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మృతులు తోడల్లుళ్లు
- జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఘటన


మహమ్మద్ హైమద్, అక్తర్ అలీ (ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మృతి చెందారు. వివరాలు.. కామారెడ్డి పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన మహమ్మద్ హైమద్(46), సైలానీ బాబా కాలనీకి చెందిన అక్తర్ అలీ(48) తోడల్లుళ్లు. హైమద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అక్తర్ అలీ మలేరియా నివారణ డిపార్ట్‌మెంట్‌లో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. హైమద్‌కి ఇద్దరు భార్యలు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. కొడుకు ఈ మధ్యనే అనారోగ్యంతో మృతి చెందాడు. అక్తర్ అలీకి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. హైమద్ శుక్రవారం ఉదయం విధులకు హాజరైన అనంతరం సొంత పనులు నిమిత్తం అక్తర్ అలీని తీసుకొని నిజామాబాద్ వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా వీరి బైక్‌ను వెనక నుంచి గుర్తు తెలియని లారీ వేగంగా ఢీకొంది. ఆ లారీ వీరి పైనుంచి వెళ్లడంతో అక్తర్ అలీ శరీరం ఛిద్రమై ఘటనా స్థలంలోనే మృతి చెందగా, హైమద్‌ని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై మహేశ్ తెలిపారు.

కత్తితో దాడికి యత్నం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో కత్తిపోట్ల ఘటన శుక్రవారం కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన అంజాద్ పని నిమిత్తం పక్కనే ఉన్న ఇందిరా నగర్ కాలనీ వైపు బైక్‌పై వెళ్తుండగా రెహమాన్ అనే వ్యక్తి అడ్డుకుని కత్తులతో దాడికి యత్నించాడు. స్థానికులు అడ్డుకుని రెహమాన్‌ను పోలీసులకు అప్పగించారు. పాత కక్షలే గొడవకు కారణం కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం అంజాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రహమాన్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి రూరల్: కామారెడ్డిలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పలు రైస్ మర్చంట్ దుకాణాలను తనిఖీ చేయగా ఓ దుకాణంలో పీడీఎస్ బియ్యం దొరికినట్లు డీటీ కిష్టయ్య తెలిపారు. దాడుల జరుగుతున్నాయనే విషయం తెలుసుకున్న పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులు తమ దుకాణాలను బంద్ చేసుకుని పరారు అయ్యారు. కొడిప్యాక శ్రీనివాస్ అనే వ్యాపారి దుకాణంలో 1.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించగా కేసు నమోదు చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

రెంజల్: కూతుళ్లతో జరిగిన గొడవతో మనస్తాపం చెంది ఓ వృద్ధురాలు కందకుర్తి వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మోస్రా మండలం చింతకుంటకు చెందిన సాయవ్వ(70) ఈ నెల 7న తన ఇద్దరు కూతుళ్లతో గొడవ పడింది. మనస్తాపం చెందిన 8న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. నదిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి మనవడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

భిక్కనూరు: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి శుక్రవారం కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ మూడు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. కామారెడ్డి మండల నర్సన్నపల్లి గ్రామానికి చెందిన సంజీవులు, అడ్లూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ జమలోద్దిన్ మద్యం తాగి వాహనాలను నడిపినందుకు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచామన్నారు.

ఇద్దరిపై కేసు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన బలసాని జ్ఞానేశ్వర్ గౌడ్, బబ్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీహరి గౌడ్‌పై బుధవారం రాత్రి పాత కక్షలను మనస్సులో పెట్టుకుని జ్ఞానేశ్వర్ గౌడ్, బబ్లు దాడికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.